
నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I హైదరాబాద్, గురువారం 6 ఫిబ్రవరి 2025 RANGAREDDY

# హామీ లేని పత్రాలు

**హడావిడిగా ఇందిరమ్మ ఇండ్ల హామీ పత్రాలను అందజేసిన అధికారులు**


**సంతకాలు లేకపోవడంతో అయోమయంలో లబ్ధిదారులు**


**ఇతర జిల్లాల్లో హామీ పత్రాలను వెనక్కి తీసుకుంటున్న అధికారులు**



సంతకాలు లేకుండానే లబ్ధిదారులకు అందజేసిన ఇందిరమ్మ ఇల్లు హామీ పత్రం..

రంగారెడ్డి, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల హామీ పత్రాలు పొందిన లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారు. జిల్లాలో మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి ఆ గ్రామాల్లో హడావిడిగా ఇందిరమ్మ ఇండ్ల హామీ పత్రాలను లబ్ధిదారులకు అధికారులు అందజేశారు. అందజేసిన హామీ పత్రాలపై ముఖ్యమంత్రి, సంబంధిత రెవెన్యూ మంత్రి పేర్లు మాత్రమే ఉన్నాయి. కానీ, వారి సంతకాలు లేవు. అలాగే, సంబంధిత గృహనిర్మాణశాఖ అధికారులు, ఎంపీడీవోల సంతకాలు లేవు. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో పడ్డారు. జిల్లాలో 21 మండలాల్లో 21 గ్రామాలను గుర్తించి నాలుగు పథకాలను ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించింది. ఆత్మీయ భరోసా కింద కొంతమందికి ప్రొసీడింగ్‌లు, రైతుభరోసా కింద పెట్టుబడి సాయం చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల హామీ పత్రాలు, రేషన్ కార్డులను అందజేశారు. కానీ, ఇందిరమ్మ ఇండ్ల హామీ పత్రంలో ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ఫొటోలతో ముద్రించిన హామీ పత్రాలు అందజేశారు. హామీ పత్రాల్లో కింద ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి పేర్లు మాత్రమే ఉన్నాయి. కాని, వాటిలో సంతకాలు లేవు. ఇతర జిల్లాలో మాత్రం హామీ పత్రాల్లో ఎంపీడీవోల సంతకాలు ఉన్నాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అధిక సంఖ్యలో వచ్చిన దరఖాస్తులతోపాటు గ్రామసభల్లోనూ మరో 84వేల వరకు దరఖాస్తులు వచ్చాయి.





### జిల్లాలో 3.75లక్షల దరఖాస్తులు.. ఇచ్చింది మాత్రం 1,067 మందికి ..

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 13 మున్సిపాలిటీలు, 21 మండలాలు, 2 కార్పొరేషన్లలో 3.75 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సొంత జాగా ఉండి ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నవారు 74,963 మంది, సొంత జాగా లేకుండా ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నవారు 1,05లక్షల మంది. చాలీచాలని సొంత ఇల్లు ఉన్న వారు 1.84లక్షల మంది ఉన్నారు. మొదటి విడుతలో జిల్లాలోని 21 గ్రామాల్లో 1,060 మందిని మాత్రమే గుర్తించి అందించిన ప్రొసీడింగ్‌లపై సంతకాలు లేకపోవడంతో బిల్లు వస్తుందా.. రాదా అన్న అయోమయంలో లబ్ధిదారులు ఉన్నారు. పక్కనే ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రం హామీపత్రాలపై సంతకాలు లేవంటూ అధికారులు హామీ పత్రాలను వెనక్కి తీసుకుంటున్నారు. ఇదే పరిస్థితి రంగారెడ్డి జిల్లాలో కూడా ఎదురయ్యే అవకాశముందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అబద్ధాలు చెప్పి పబ్బం గడుపుతున్న కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీకి ఓటుతో బుద్ధిచెప్పాలి

గులాబీ పార్టీకి ఓటు వేసి మళ్లీ పథకాలు తెచ్చుకుందాం

బంగారు తెలంగాణ కేసీఆర్‌తోనే సాధ్యం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి



రైతు ధర్నా నిర్వహించిన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

## రైతులకు అండగా
# కేసీఆర్ సైన్యం

వికారాబాద్/నవాబుపేట, ఫిబ్రవరి 5 : 'రైతులకు, ప్రజలకు కేసీఆర్ సైన్యం అండగా ఉంటుంది.. ఎవరూ అధైర్యపడొద్దు..' అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం నవాబుపేట మండల కేంద్రంలోని రైతు వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్‌పై పోరుకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌లతో కలిసి రైతు ధర్నా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ఎదుట బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రైతులు, ప్రజలు, పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడారు. రుణ మాఫీ కాలేదని, రైతుభరోసా రాలేదని, పింఛన్ రాలేదని దాదాపుగా 100 మందికిపైగా తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 14 నెలలవుతున్నా 6 గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. పావు వంతు మందికి కూడా రుణమాఫీ కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతో పబ్బం గడుపుతున్నదన్నారు. రుణ మాఫీకి రూ.49వేల కోట్లు కావాలని బ్యాంకువారు చెప్పారన్నారు. అసెంబ్లీలో మాత్రం రూ.31వేల కోట్ల ఇస్తామని తీర్మానం చేసి, మరో సారి రూ.29వేల కోట్లు అంటూ మాటతప్పి.. చివరకు రూ.18వేల కోట్లు మాత్రమే మాఫీ చేయడం సిగ్గుచేటన్నారు. జనవరి 26న రైతులకు రైతుభరోసా అందుతుందని మాట ఇచ్చి తప్పారన్నారు. ఏడాదికి రూ.15వేలు ఇస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఇవ్వలేదన్నారు. ఆసరా పింఛన్, రేషన్ కార్డులు, మహిళలకు రూ.2500, తులం బంగారం వంటి ఆరు గ్యారెంటీలు ఎక్కడికి పోయాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం చేస్తామని మాట ఇచ్చి .. మళ్లీ మాట మార్చడం అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ముందే చెప్పిండు.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పథకాలు రావు.. ప్రజలు, రైతులు ఆగం ఆగం అవుతారన్న మాటలు నిజమవుతున్నాయన్నారు. ప్రజలందరూ మా కుటుంబ సభ్యులే... వారికి ఏ కష్టం వచ్చినా బీఆర్‌ఎస్ సైన్యం అండగా ఉంటుందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో నవాబుపేట మండలానికి సాగునీరు అందిస్తే రైతుల బతుకులు బాగు పడుతాయన్నారు. ఇప్పటికే 416 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. 420 రోజులు గడిచినా కనీసం 6 గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే ఎన్నికలలో ఇండ్ల ముందుకువచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలన్నారు. రైతులకు అండగా బీఆర్‌ఎస్ పార్టీ ఉంటుందని ధైర్యం చెప్పారు. రైతుల సమస్యలపై సీఎంకు పోస్టుకార్డులు పంపిస్తున్నట్లు మాజీ మంత్రి సబితారెడ్డి తెలిపారు.

అనంతరం నవాబుపేట మండలం పులుమామిడి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులు దేశమోళ్ల ఆంజనేయులు, వెజ్ బోర్డు మాజీ చైర్మన్ నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శాంత్‌కుమార్, విజయ్‌కుమార్, మహేశ్ రెడ్డి, జగన్‌రెడ్డి, మల్లారెడ్డి, గౌస్, వెంకట్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ

### రైతులు గోస పడుతున్నరు..
**- మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్**



కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు గోసపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. రైతు భరోసా రూ.15 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రెండు దఫాలుగా ఎగ్గొట్టిందన్నారు. ప్రస్తుతం ఒక్కో మండలంలో ఒక్కో చిన్న గ్రామాలను ఎంపిక చేసి కొంత మంది రైతులకే రైతు భరోసా ఇచ్చి చేతులు దులుపుకొన్నదన్నారు. చేవెళ్లలో ఉప ఎన్నికలు వస్తాయని కేటీఆర్ ముందే చెప్పారన్నారు. ఉద్యమ సమయాల్లో రైతుల బాధలు చూసిన అధినేత కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా పథకాలను తీసుకొస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు.

### బీసీల ఓట్ల కోసం రేవంత్‌రెడ్డి నాటకం అడుతున్నడు..
**- బీసీ కమిషన్ మాజీ మెంబర్ శుభప్రద్‌పటేల్**



నిన్న జరిగిన అసెంబ్లీ సమావేశంలో బీసీల కుల గణన విషయంలో మోసం చేయడం సిగ్గుచేటని, బీసీల ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాటకం ఆడుతున్నాడని మాజీ బీసీ కమిషన్ మెంబర్ శుభప్రద్‌పటేల్ విమర్శించారు. రాబోవు స్థానిక ఎన్నికల్లో బీసీలంతా కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు.

### కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి..
**- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి**



రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోవు రోజుల్లో గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. రైతుభరోసా పథకం కింద ఏడాదికి రూ.15వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి రూ.12 వేలకు కుదించడం ఏమిటని ప్రశ్నించారు. రూ.4వేలు ఆసరా పింఛన్, మహిళలకు రూ.2500 ఎప్పుడిస్తారని మండిపడ్డారు. కాంగ్రెస్ చేస్తున్న మోసంపై రైతులు, ప్రజలు చర్చించుకోవాలన్నారు. నవాబుపేట మండలంలో రోడ్లు పాడయ్యాయని, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఏం చేస్తున్నారో ప్రజలకు జవాబు చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు.

### కాంగ్రెస్ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నది..
**- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి**



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులనేకాకుండా ప్రజలనూ ఇబ్బందులు పెడుతున్నదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి అన్నారు. రైతుల బాధను చూసిన కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా పథకాలను తీసుకొచ్చారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను ఇవ్వడంతోపాటు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఒక ఏఎస్ఐ నారాయణసింగ్ రిటైర్‌మెంట్ అయ్యాక కూడా తనకు పైసలు రాలేదని, సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగా లేఖ రాశారని గుర్తు చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలో త్వరలోనే ఉప ఎన్నిక జరగనున్నదని, బీఆర్‌ఎస్ అభ్యర్థి భారీ మెజార్టీతో ఘన విజయం సాధించడం ఖాయమన్నారు.



# మార్చికి ముందే మంటలు

- ఎండ@33 డిగ్రీలు
- రంగారెడ్డి జిల్లాలో ఉదయం 9 గంటల నుంచే సెగలు
- ఎండ వేడిమికి బయటకు వెళ్లలేని జనం
- వేడిగాలులతో వడదెబ్బ బారిన పడే ప్రమాదం
- మార్చి, ఏప్రిల్, మే నెలలో ఎండలు తీవ్రమయ్యే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్య నిపుణులు

**ఎండలు ముదురుతున్నాయి. రోజురోజుకూ పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో గత వారం రోజులుగా అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. జిల్లాలో బుధవారం గరిష్ఠంగా 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగ మండుతుండడంతో రోడ్లన్నీ వెలవెలబోయాయి. నిన్న, మొన్నటి వరకు చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కగా.. ఇక మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే శీతలపానీయాలను ఆశ్రయిస్తుండగా, అటు ఉక్కపోత నుంచి విముక్తి పొందేందుకు కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు అత్యధికంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 28-33 డిగ్రీలకు వరకు నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలకు పైగా ఉంటున్నాయి.**

**- షాబాద్, ఫిబ్రవరి 5**

### ఎండలతో ఉక్కిరిబిక్కిరి..

మొన్నటి వరకు చలితో సతమతమైన ప్రజలు ప్రస్తుతం ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఫిబ్రవరి నెలలోనే భానుడు భగ్గుమంటున్నాడు. దీంతో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉన్నప్పటికీ మధ్యాహ్నం అయ్యే సరికి ఎండ తీవ్రత పెరుగుతున్నది. పెండ్లిళ్ల సీజన్ ఉండడంతో ప్రజలు తలకు టవల్, కర్చీఫ్, టోపీలు, గొడుగులు ధరించి కనపడుతున్నారు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయం, సాయంత్రం వేళలను ఎంచుకుంటున్నారు. ఇప్పుడే ఎండల తీవ్రత ఇంత స్థాయిలో ఉంటే.. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఎండల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొబ్బరి బోండాలు, నిమ్మకాయ పాయాలు, లస్సీలు, పండ్ల రసాలకు గిరాకీ పెరిగింది.





### మార్చి, ఏప్రిల్, మే లో ఎండలు ఎక్కువగా ఉండే అవకాశం

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్, మే నెలలతో పాటు రోహిణి కార్తె ఎండలు తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తున్నది. ఇప్పటివరకు ఉన్న వాతావరణం వేరు, రానున్న కాలంలో పరిస్థితులు వేరుగా ఉండనున్నాయి. రాత్రిపూట చలి, మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. దినసరి కూలీలు ఉదయం పూటనే పనులు పూర్తి చేసుకుని మధ్యాహ్నంలోగా ఇంటికి చేరుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇకనుంచి మధ్యాహ్నం పూట బయటకి వెళ్లాలంటే తప్పకుండా గొడుగులు వెంట తీసుకువెళ్లాలని చెబుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచిస్తున్నారు. మరో మూడు నెలలు ఎండలు అధికంగా ఉండే అవకాశం ఉన్నదని, వడగాలులు వీచే అవకాశాలు ఉన్నట్లు వైద్యనిపుణులు సూచిస్తున్నారు.